సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

బుధవారం । 24 । జూలై । 2024




మృత్యు కౌగిలికి మరొకరు...
కాకినాడలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే ఇద్దరు యువకులు చనిపోగా మరో యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

II లో



మధుమేహపు కోత
మధుమేహం చేసే హాని గుండె కోతకు కారణమవుతోంది. చంటిపిల్లల్లా చూసుకున్న శరీర భాగాలు కళ్ల ముందే దేహం నుంచి వేరుపడుతుంటే ప్రాణం పోయినంత పనవుతుంది.

డెల్టాలకు 3,300 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 3,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,200, మధ్య డెల్టాకు 1,600, పశ్చిమ డెల్టాకు 500 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

తాగునీరు, డ్రైనేజీ సమస్యపై టోల్ ఫ్రీ నంబర్

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అధిక వర్షాలు, వరద ప్రభావిత ప్రాంతాలలో తాగునీరు, చెత్తకుప్పలు, డ్రైనేజీ, నీరు నిల్వ ఉండటం, దోమల బెడద, ఇతర పారిశుధ్య సమస్యలపై ఫిర్యాదుల చేయడం కోసం అమలాపురం కలెక్టరేట్‌లో **టోల్ ఫ్రీ నంబర్** 18004252532 ఏర్పాటు **చేసినట్లు జిల్లా** గ్రామ పంచాయితీ అధికారి దాసరి **రాంబాబు ఒక ప్రక**టనలో తెలిపారు. జిల్లా**లో ప్రజలు ఈ సేవ**లను సద్వినియోగం చే**సుకోవాలని అయన** కోరారు.

భక్తులు దర్శనాలను వాయిదా వేసుకోవాలి

మామిడికుదురు: గోదావరి **వరదల కారణంగా** అప్పనపల్లి గ్రామం జలది**గ్బంధంలో చిక్కుకున్న** కారణంగా బాల బాలాజీ **స్వామి దర్శనానికి** వచ్చే భక్తులు తమ ప్ర**యాణాలను వాయిదా** వేసుకోవాలని ఆలయ **ఈఓ గ్రంధి మాధవి** కోరారు. ఆమె మంగళవా**రం స్థానిక విలేకరు**లతో మాట్లాడుతూ జిల్లా **ఉన్నతాధికారుల ఆదే**శాల మేరకు అప్పనప**ల్లిలో బాలబాలాజీ** స్వామివారి దర్శనాలను **బుధవారం నుంచి** నిలిపి వేస్తున్నామన్నారు. గోదావరి వరద నీటిలో దర్శనానికి వచ్చే భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

సిబ్బంది విద్యుత్తు ధర్మం



ఊడిమూడిలంకలో వరద నీటిలో విద్యుత్ లైన్‌ను పునరుద్ధరిస్తున్న సిబ్బంది

పి.గన్నవరం: మండలంలోని ఊడిమూడిలంక వద్ద 11 కేవీ విద్యుత్ లైన్‌లో మంగళవారం ఉదయం 7 గంటలకు ఒక స్తంభం వరద ఉధృతికి నీటిలో పడిపోయింది. దీంతో ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిలంక గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ఏఈ ఆనందరాజు తన సిబ్బందిని అప్రమత్తం చేశారు. దీంతో లైన్‌మన్లు, సిబ్బంది కలిసి పడవపై ఆ ప్రాంతానికి చేరుకుని వరదనీటిలో పడిపోయిన స్తంభం నుంచి వైర్లు తొలగించి 11 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. నడుంలోతు వరదనీటిలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించిన విద్యుత్‌శాఖ సిబ్బందిని ఆయా గ్రామాల ప్రజలు అభినందించారు.

టీచ్ టూల్ శిక్షణ పరిశీలన

అమలాపురం టౌన్: అమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, రూరల్ మండలం పేరూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో డివిజన్‌లోని ఉపాధ్యాయులకు జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణ తరగతులను డీఈవో ఎం.కమలకుమారి మంగళవారం మరోసారి పరిశీలించారు. తొమ్మిదిరోజుల పాటు సాగనున్న ఈ శిక్షణ తరగతుల్లో ఇప్పటికే పూర్తయిన అయిదు రోజుల శిక్షణపై ఆమె అధ్యయనం చేశారు. మిగిలిన నాలుగు రోజుల శిక్షణను కూడా ఉపాధ్యాయులు సమర్థంగా ఆకళింపు చేసుకోవాలని సూచించారు. సర్టిఫైడ్ అబ్జర్వర్స్‌గా పాఠశాలల తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ పట్ల డీఈవో సంతృప్తి వ్యక్తం చేశారు. డీఈవోతోపాటు అమలాపురం డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బీవీవీ సుబ్రహ్మణ్యం, టీచ్ టూల్ ప్రోగ్రామ్ నోడల్ అధికారి పిల్లి రాంబాబు, ఎల్ఎఫ్ఈ స్టేట్ కో ఆర్డినేటర్ క్రాంతికుమార్, జిల్లా కో ఆర్డినేటర్ వివేక్, వివిధ మండలాల ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత మండలాల్లోని విద్యాసంస్థలకు నేడు సెలవు

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కొన్ని మండలాల్లోని గ్రామాలు ముంపునకు గురై రాకపోకలకు ఇబ్బందులు ఉన్న కారణంగా వరద ప్రభావిత మండలాల్లోని అన్ని విద్యాసంస్థలకు బుధవారం సెలవు ప్రకటించామని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. వరద ప్రభావం లేని మిగిలిన ప్రాంతాలలో విద్యాసంస్థలు యథావిధిగా నడుస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు.

వరద నష్ట పరిహారం అందించాలి

అమలాపురం టౌన్: వరదల వల్ల నష్టపోయిన ఇళ్లకు, పంటలకు రాష్ట్ర ప్రభుత్వం త్వరగా నష్ట పరిహారం ఇచ్చే ఏర్పాట్లు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు డిమాండ్ చేశారు. స్థానిక బండివారిపేటలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో మంగళవారం జరిగిన పార్టీ విస్తృత సమావేశంలో సత్తిబాబు మాట్లాడారు. అమలాపురంలో దుకాణాలు రాత్రి 11 గంటల వరకూ తెరచి ఉంచుకునే వెసులుబాటు ఇవ్వాలని పోలీసుశాఖను కోరుతూ సమావేశం తీర్మానం చేసింది. పార్టీ జిల్లా ఇన్ చార్జి డేగా ప్రభాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు దేవ రాజేంద్రప్రసాద్, పి.రాము, కొండే రామకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డున పడ్డ మత్స్యకారులు



మురమళ్ల వద్ద నీట మునిగిన మత్స్యకార కాలనీ

- ఐ.పోలవరం మండలం ఏటిగట్టు లోపల ఉన్న లోతట్టు ప్రాంతాలు, పంట పొలాల్లోకి నీరు వచ్చి చేరుతోంది. మురమళ్ల రాఘవేంద్ర వారధి వద్ద మత్స్యకార కాలనీలోకి వరద నీరు చొచ్చుకువచ్చి ఇళ్లలోకి చేరింది. ఇక్కడ ఎనిమిది వరకు ఇళ్లు ఉన్నాయి. ఇళ్లలోకి నీరు చేర**డంతో స్థానికులు ఏటిగట్టు మీదకు చేరారు.**

ముంపులో వరి చేలు



ముమ్మిడివరం అయినాపురం ఔట్‌ఫాల్ స్లూయిజ్ షట్టర్ లేచిపోవడంతో వచ్చిన వరద నీటిలో మునిగిన వరి చేలు

- అయినాపురం వద్ద అవుట్ పాల్ స్లూయిజ్ షట్టర్లు పాడై వరద నీరు ముంచెత్తడంతో అయినాపురం, కొత్తలంక, సోమిదేవరపాలెం గ్రామాలు ముంపులో చిక్కుకున్నాయి. అయినాపురం డ్రెయిన్ ద్వారా వరద నీరు ముంచెత్తింది. డ్రెయిన్, వరిచేలు ముంపులో ఏకమయ్యాయి. ఇప్పటి వరకు నాట్లు వేసిన వరిచేలు 200 ఎకరాలు పూర్తిగా నీట మునిగాయి. ముంపునీరు దిగకపోతే **రైతులు మరింత నష్టపోనున్నారు.**

గట్ల మీద గుడిసెలు



పి.గన్నవరం మండలం ఊడుమూడి ఏటిగట్టు మీద తాత్కాలికంగా గుడిసెలు వేసుకున్న **సంచార** జాతుల వారు

- పి.గన్నవరం మండలం ఊడుమూడిలో సంచార జాతుల వారు ఏటిగట్టు దిగువన జీవిస్తుంటారు. సుమారు ఎనిమిది కుటుంబాల వరకు మహిళలు, పిల్లలు కలిసి జీవిస్తున్నారు. వరదకు నీరు ముంచెత్తడంతో వీరు ఏటిగట్ల మీద తాత్కాలికంగా గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. తమను ఆదుకోవాలని వీరు **స్థానిక అధికారులను కోరుతున్నారు.**

లంకపొంకాలు



పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వరద ఉధృతి

- నీట మునుగుతున్న ఇళ్లు.. చేలు..
- గట్ల మీద గుడిసెలతో తాత్కాలిక నివాసాలు
- ఉగ్రరూపం దాల్చిన గోదావరి నదీపాయలు
- మరింత పెరిగిన వరద ఉధృతి
- పి.గన్నవరం, ముమ్మిడివరం, అయినవిల్లి, మామిడికుదురు మండలాలపై ప్రభావం
- కాజ్‌వేలపై పడవల ఏర్పాటు

సాక్షి,అమలాపురం: గోదావరి ఉగ్రరూపం దాలుస్తోంది. ఎటు చూసినా వరద నీరు. గోదావరి మధ్యనున్న లంక గ్రామాలను ముంచెత్తుతోంది. లంకల్లో ఇళ్లు, చేలు, రోడ్లు, గ్రామాల్లోకి వరద నీరు వచ్చేసింది. గోదావరి నదీపాయలైన గౌతమీ, వృద్ధగౌతమీ, వైనతేయ, వశిష్టలలో వరద తాకిడి అంతకంతకూ పెరుగుతుండడంతో లంక వాసుల కష్టాలు రెట్టింపయ్యాయి. ఇళ్ల చుట్టూ వరద నీరు చేరింది. నదిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న మత్స్యకారులు, అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. చేలు, పొలాలు చెరువులుగా మారాయి. వరద నీటి ఉధృతికి అవుట్ ఫాల్ స్లూయిజ్‌లు దెబ్బతినడంతో డెల్టాలో వరి చేలు సైతం పెద్ద ఎత్తున ముంపుబారిన పడుతున్నాయి. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి మంగళవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో 14,10,928 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. భద్రాచలం వద్ద వరద తగ్గుముఖం పడుతున్నా జిల్లాలో **మరో 24 గంటల పాటు ప్రభావం ఉంటుందని అంచనా. ధవళేశ్వరం వద్ద బుధవారం మధ్యాహ్నం వరకు వరద ఉధృతి కొనసాగనుంది.**

జిల్లాలో వరద పరిస్థితి ఇలా..

- **పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లి, మానేపల్లి శివారు శివాయలంకలకు వెళ్లే రహదారులపై మంగళవారం వరదనీరు ప్రవహిస్తోంది. మూడు అడుగుల ఎత్తున నీరు ప్రవహిస్తుండడంతో శివాయలంక వెళ్లేందుకు అధికారులు ట్రాక్టర్ ఏర్పాటు చేశారు. ఊడిమూ**డిలంక, జి.పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిలంక గ్రామాల ప్రజలు వరద ఉధృతిలో ఇంజన్ పడవలపై రాకపోకలు సాగిస్తున్న విషయం విదితమే. బూరుగులంకకు వెళ్లే దారిలో ఏటిగట్టు దిగువన పాయలోకి నీరు చేరడంతో అక్కడ సిమెంటు రోడ్డు మునిగిపోయింది. సరిహద్దు జిల్లాకు చెందిన పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక, చాకలిపాలెం శివారు కనకాయలంక గ్రామాల ప్రజలు ఇంజన్ పడవలపై ప్రయాణిస్తున్నారు. కె.ముంజవరం వద్ద అవుట్‌ఫాల్ స్లూయిస్ వద్ద వైనతేయ పాయ నుంచి వరద నీరు డ్రెయిన్‌లోకి వస్తుండటంతో అక్కడ ఇసుక బస్తాలతో పటిష్ట చర్యలు చేపట్టారు.
- మామిడికుదురు మండలం అప్పనపల్లి కాజ్‌వే వరద ముంపునకు గురైంది. పెదపట్నంలంక, అప్పనపల్లి, బి.దొడ్డవరం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రత్యామ్నాయంగా మామిడికుదురు శివారు కొర్లగొంట మీదుగా అప్పనపల్లి రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మార్గం సైతం నీట మునిగింది. ఆటోలు, ఆర్టీసీ బస్సులు, కార్ల మీద రాకపోకలు నిలిచిపోయాయి.
- అయినవిల్లి మండలం ముక్తేశ్వరం వద్ద ఎదురుబిడియం కాజ్‌వేపై మరింత వరద నీరు చేరింది. వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, కపిలేశ్వరపురం మండలం అద్దంకివారిలంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కాజ్‌వే వద్ద నాలుగు పడవలు అందుబాటులో ఉంచడంతో స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. వీటి మీద నుంచి రైతుల తమ వ్యవసాయ ఉత్పత్తులను, పాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పొట్టిలంక, వీరవల్లిపాలెం, కొండు**కుదురులంకల వద్ద ఐదు పడవలను ముందు జాగ్రత్త చర్యగా సిద్ధం చేశారు.**
- కె.గంగవరం మండలం కోటిపల్లి వద్ద మత్స్యకార కాలనీలో సుమారు 100 ఇళ్లు వరద ముంపులో చిక్కుకున్నాయి. ఇక్కడ 450 కుటుంబాల వారు నివాసముంటున్నారు. కాలనీలో రోడ్లు ముంపుబారిన పడ్డాయి. తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. కోటిపల్లి రేవు వద్ద గోదావరి మరింత ఉధృతంగా ప్రవహిస్తోంది.
- ఐ.పోలవరం మండలం ఏటిగట్టు లోపల ఉన్న లోతట్టు ప్రాంతాలు, పంట పొలాల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. మురమళ్ల రాఘవేంద్ర వారధి వద్ద మత్స్యకార కాలనీలోకి వరద నీరు చొచ్చుకు వచ్చి ఇళ్లలోకి చేరింది. ఇక్కడ ఎనిమిది వరకు ఇళ్లు ఉన్నాయి. ఇళ్లలోని నీరు చేరడంతో స్థానికులు ఏటిగట్టు మీదకు చేరారు. కొమరగిరి, పశువులంక, ఎదుర్లంక, కేశనకుర్రు, గుత్తెనదీవిలలో గోదావరి ఆనుకుని ఉన్న చోట రొయ్యల చెరువులు నీట మునిగాయి. ఇది ముందే ఊహించిన రైతులు ఇప్పటికే రొయ్యల పట్టుబడులు చేశారు. అన్నంపల్లి అక్విడెక్టును తాకుతూ వరద నీరు ప్రవహిస్తోంది.
- ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠానేల్లంక, గురజాపులంక, కూనాలంక, సలాదివారిపాలెం, కమిని ఐ.పోలవరం మండలం పాగాపులంక, కరవా**పులంక,** ఎదుర్లంక లంక గ్రామాల ప్రజలకు వరదలు **రెండు** రోజులుగా కంటిమీద కునుకు లేకుండా **చేశాయి.** నియోజకవర్గంలోని లంక గ్రామాల్లో సుమారు 300 వందల ఎకరాల్లో వాణిజ్య పంటలైన అరటి, కొబ్బరి, కాయగూర తోటలు ముంపు బారిన పడ్డాయి. పంట పొలాల్లో పచ్చిక బయళ్లు ముంపునకు గురవడంతో పశువులు మేత లేక విలవిలలాడుతున్నాయి. అయినాపురం వద్ద అవుట్ ఫాల్ స్లూయిజ్, షట్టర్లు పాడై వరద నీరు ముంచెత్తడంతో అయినాపురం, కొత్తలంక, సోమిదేవరపాలెం గ్రామాలు ఇంకా ముంపుబారిన ఉన్నాయి. నాట్లు వేసిన వరిచేలు తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.
- కాట్రేనికోన మండలం వృద్ధ గౌతమి కుడి ఏటిగట్టు కుండలేశ్వరం వద్ద సుమారు 50 మీటర్ల మేరకు దిగబడి పోవడంతో ఆయా ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏటిగట్టు బొబ్బర్లంక-పల్లంకుర్రు ప్రధాన పంటకాలువ వైపు అండలుగా జారి గట్టు బలహీన పడిపోయింది. వరద ఉధృతి మరింత పెరిగితే ఇక్కడ పెను ప్రమాదం ఏర్పడే పరిస్థితులు ఉత్పన్నమవుతాయని భయపడుతున్నారు.
- సఖినేటిపల్లి మండలం అప్పనరాముని లంకలో ప్రధాన రహదారి మీద వరద నీరు ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి.



అల్లవరం మండలం బోడసకుర్రులో వరద నీరు చుట్టుముట్టిన ఇంటి వద్ద వంట చేసుకుంటున్న మత్స్యకార మహిళ

ఇంటి చుట్టూ నీరే

అల్లవరం మండలం బోడసకుర్రు పల్లిపాలెంలో సుమారు 40 ఇళ్లు నీట మునిగాయి. ఇళ్లలోకి నీరు చేరింది. నదిని ఆనుకుని ఉన్న ఇళ్లలోకి వరద నీరు చేరింది. వరద పెరిగితే ఇక్కడ పునరావాస కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. ఇంటి చుట్టూ వరద నీరు చేరినా మత్స్యకార మహిళలు అక్కడే ఉంటూ వంట చేసుకుంటున్నారు.

రామేశ్వరంమొగలో ఇసుక మేటల తొలగింపు

- పూడికతీత పనులకు టీఆర్–27 నిధులు రూ.29 లక్షల మంజూరు
- నాలుగు మండలాల్లో 30 వేల ఎకరాలకు ముంపు నుంచి విముక్తి
- కలెక్టర్ మహేష్‌కుమార్



రామేశ్వరం మొగలో ఇసుక మేటలు తొలగించడంతో వడి వడిగా సముద్రానికి వెళుతున్న ముంపునీరు

అల్లవరం: అల్లవరం మండలం కొమరగిరిపట్నం శివారు ఎస్.రామేశ్వరం మొగలోని ఇసుక మేటలను తొలగించి ముంపు నీరు సముద్రానికి వెళ్లేందుకు యంత్రాల సహాయంతో మార్గం సుగమం చేశామని కలెక్టర్ మహేష్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏటా వేసవి కాలంలో డ్రెయిన్లో నీటి ప్రవాహం లేకపోవడంతో సముద్రపు కెరటాలతో రామేశ్వరం మొగలో ఇసుక మేటలతో మూసుకుపోయి ముంపు నీరు స్తంభిస్తోందన్నారు. భారీ వర్షాలు, తుపాన్ల ప్రభావంతో అల్లవరం, అమలాపురం, ఉప్పలగుప్తం, అయినవిల్లి మండలాల్లోని 30 వేల ఎకరాల్లోని ముంపు నీరు సముద్రానికి వెళ్లకుండా ఇసుక మేటలు అడ్డుకుంటున్నాయి. దీంతో పొలాలు ముంపుబారిన పడి రైతులకు నష్టం వాటిల్లుతోందన్నారు. ఇసుక మేటలతో మూసుకుపోయిన రామేశ్వరం మొగని తెరవడం ద్వారా వరి పొలాల్లో స్తంభించిన ముంపు నీరు డ్రెయిన్ల ద్వారా సముద్రానికి చేరుతుందని తద్వారా వేలాది ఎకరాల్లోని పంటను కాపాడుకోగలమని కలెక్టర్ తెలిపారు. మొగలో ఇసుక మేటలను తొలగించడానికి టీఆర్–27 కింద డ్రెయిన్ శాఖకు రూ.29 లక్షలు మంజూరు చేశామన్నారు. వారం రోజుల క్రితం ప్రారంభించిన పూడికతీత పనులు మంగళవారం నాటికి పూర్తి చేయడంతో ముంపు నీరు వడి వడిగా సముద్రానికి చేరుతోందన్నారు.

ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికుల ఉపాధికి గండి

జిల్లా యూనియన్ అధ్యక్షుడు సత్తిరాజు ఆవేదన



సంఘీభావాన్ని ప్రకటిస్తున్న జిల్లా ఆటో యూనియన్ కార్మిక నేతలు

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలుకు సిద్ధమవుతున్న ఆర్టీసీ మహిళా ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో కార్మికుల ఉపాధికి తీవ్ర నష్టం ఏర్పడుతుందని ఆంధ్రా ఆటో వాలా యూనియన్ జిల్లా సమితి అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక బండివారిపేట అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో మంగళవారం జరిగిన ఆటో యూనియన్ జిల్లా సమావేశానికి సత్తిరాజు అధ్యక్షత వహించి ప్రసంగించారు. మహిళా ఉచిత బస్సు ప్రయాణంపై ఆటో కార్మికులు పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. వచ్చే నెల 15వ తేదీ నుంచి మహిళా ఉచిత ప్రయాణాన్ని అమలు చేస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రకటించిన క్రమంలో పోరాటానికి కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.సత్తిబాబు సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆరు లక్షల మంది ఆటో కార్మికులు ఈ విధానం అమలు వల్ల ఉపాధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి ఊటాల వెంకటేష్ కూడా ప్రసంగిస్తూ ఆటో కార్మికుల ఉపాధి రక్షణ కోసం మనమంతా పోరుబాట పట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈలోగా వచ్చే నెల మొదటి వారంలో ప్రభుత్వ పెద్దలకు మహిళల ఉచిత ప్రయాణం విధానం వల్ల ఉపాధికి నష్టం వాటిల్లుతోందన్న వాస్తవాన్ని వివరించాలని సమావేశం తీర్మానం చేసింది. అప్పటికీ ప్రభుత్వం మన విజ్ఞాపనను పట్టించుకోకపోతే పోరాటాలు తప్పవని సమావేశం స్పష్టం చేసింది.

జిల్లాలో 75 గ్రామాలకు వరద ముంపు

కలెక్టర్ మహేష్‌కుమార్

ముమ్మిడివరం: జిల్లాలో 12 మండలాల్లో 75 గ్రామాలు గోదావరి వరదల మూలంగా ముంపు బారిన పడే అవకాశ ముందని కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం మండల పరిధిలో అన్నంపల్లిలో ఫ్లడ్ స్టోర్‌లో ఉన్న నిల్వలను పరిశీలించారు. 42వేల ఇసుక బస్తాలు, ఇతర సామగ్రి ఉండటాన్ని గుర్తించి అధికారులకు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ సామగ్రిని ఏటుగట్లు బలహీనంగా ఉన్న చోట్లకు జలవనరుల శాఖ ఇంజినీర్లు తరలిస్తున్నారన్నారు. వరదలను సమర్థంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని, ముంపు బాధితులు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదన్నారు. ముంపు ప్రభావిత ప్రాంతాలలో క్షేత్ర స్థాయి, సచివాలయ సిబ్బంది సహాయక చర్యలు అందించేందుకు 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. కాటన్ బ్యారేజీ వద్ద దిగువకు 13.లక్షల క్యూసెక్కుల నీరు వదులుతున్నారని దీని ప్రభావం జిల్లాలో మరో రెండు రోజులు కొన సాగే అవకాశ ముందన్నారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి పీకేపీ ప్రసాద్, డ్రెయిన్స్ డిఈ ఎంవీవీ కిశోర్, ఈశ్వర మన్యం, సునీతా దేవి తదితరులున్నారు.

ఆశనిరాశలు



- మాట నెరవేరుస్తారా.. 'సీత'కన్ను వేస్తారా?
- కేంద్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు
- కేంద్ర మంత్రి మాటలు నిజమైతే ప్రగతికి ఊతమంటున్న కొందరు
- మొండిచేయి చూపుతారేమోనని పలువురి సందేహం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వివిధ రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు చేసిన ప్రకటన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వివిధ రంగాలకు ఊతమిస్తుందని కొంతమంది చెబుతున్నారు. అయితే చివరిలో 'సీత'కన్ను వేసి, మొండిచేయి చూపుతారేమోనని మరికొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఈసారైనా 'దారి' చూపుతారా?

జాతీయ రహదారులు, విశాఖ – చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు ప్రాధాన్యం ఇస్తున్నట్లు కేంద్ర మంత్రి బడ్జెట్‌లో ప్రకటించారు. జిల్లాల మధ్య రహదారి వ్యవస్థ బలోపేతానికి చేయూతనందిస్తామని చెప్పారు. దీనిపై కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల ప్రజలు ఆశలు పెట్టుకుంటున్నారు. వాస్తవానికి ఈ రహదారుల్లో చాలా వరకూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించి, సాధించుకున్నవే కావడం విశేషం.

- కాకినాడ – అన్నవరం మధ్య సముద్ర తీర ప్రాంతం మీదుగా 45 మీటర్ల వెడల్పుతో 40.319 కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణం ఈసారైనా జరగవచ్చని భావిస్తున్నారు. ఇది పూర్తయితే కాకినాడ పోర్టుతో పాటు తీరంలో పారిశ్రామికీకరణ ఊపందుకునే అవకాశాలుంటాయి.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురం నుంచి రావులపాలెం వరకూ 35 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి నిర్మాణంపై కూడా ఆ ప్రాంత ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వందలాది వాహనాలతో నిత్యం ఎంతో రద్దీగా ఉండే ఈ రోడ్డు చాలా ఇరుకుగా ఉంటూ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డుకు జాతీయ రహదారిగా గుర్తింపు సాధించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాటి మంత్రి పినిపే విశ్వరూప్ చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఈ రోడ్డును సుమారు రూ.400 కోట్లతో జాతీయ రహదారిగా అభివృద్ధి చేసేందుకు అప్పట్లో కేంద్రం సూత్రప్రాయంగా ఆమోదం కూడా తెలిపింది. ఈ రోడ్డు జాతీయ రహదారిగా అభివృద్ధి చెందితే ప్రమాదాలు తగ్గడంతో పాటు సమయం కూడా కలసి వస్తుంది.
- రాజమహేంద్రవరం నగరంలో మోరంపూడి ఫ్లైఓవర్ వంతెన గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలోనే పట్టాలెక్కింది. 1.42 కిలోమీటర్ల నాలుగు లేన్ల ఈ వంతెన పనులను రూ.60 కోట్లతో చేపట్టారు. బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించి ఈ వంతెన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు ఆశిస్తున్నారు.

పారిశ్రామిక వెలుగులు ప్రసరించేనా!

అనేక వివాదాలతో అభివృద్ధికి నోచుకోని కాకినాడ సెజ్ సమస్యకు గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పరిష్కారం చూపించారు. ఈ నేపథ్యంలో పలువురు పరిశ్రమల ఏర్పాటుకు ఇప్పుడిప్పుడే ముందుకు వస్తున్నారు. ఇప్పటికే పెరుమాళ్లపురం వద్ద సాగర తీరంలో రూ.2,123 కోట్లతో గేట్‌వే పోర్టు, రూ.2,500 కోట్ల అరబిందో గ్రూపు పెన్సిలిన్ జీ, రూ.2,000 కోట్లతో దివీస్ ఫార్మా వంటి పరిశ్రమల పనులు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమయ్యాయి. వీటితో పాటు రూ.422 కోట్లతో ఉప్పాడ మేజర్ హార్బర్ నిర్మాణం కూడా నాటి సీఎం జగన్ హయాంలోనే ప్రారంభమయింది. ఈ తరుణంలో బడ్జెట్‌లో పారిశ్రామికీకరణకు పెద్ద పీట వేస్తామని కేంద్ర మంత్రి నిర్మలమ్మ ప్రకటించడంతో ఇక్కడ పరిశ్రమలు వస్తాయేమోనని పలువురు ఆశ పడుతున్నారు.

బంగారం వ్యాపారానికి ఊతం!

బంగారంపై సుంకం తగ్గిస్తున్నట్లు కేంద్ర మంత్రి ప్రకటించారు. దీంతో వీటి ధరలు దిగి వచ్చి, బంగారం వ్యాపారం పెరుగుతుందని బులియన్ మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా రాజమహేంద్రవరం నగరంలో ప్రతి రోజూ రూ.15 కోట్ల మేర బంగారు ఆభరణాల విక్రయాలు జరుగుతూంటాయి. కాకినాడ నగరంలో నెలకు రూ.20 కోట్లు, అమలాపురం, మండపేట వంటి పట్టణాల్లో నెలకు ఐదారు కోట్ల రూపాయల మేర బంగారం వర్తకం జరుగుతూంటుంది. ఇది మరింత పెరగవచ్చని బంగారు వర్తకులు ఆశిస్తున్నారు.

వీటిపై పెదవి విరుపే..

- కేంద్ర బడ్జెట్‌లో రైతులకు, యువతకు పెద్దగా ప్రాధాన్యం ఇచ్చామని చెబుతున్నా ఆ స్థాయిలో ప్రయోజనాలు కనిపించడం లేదని రైతు సంఘాల ప్రతినిధులు పెదవి విరుస్తున్నారు. ఎరువులు, పురుగు మందుల తయారీకి అవసరమైన రసాయనాలపై ఈ బడ్జెట్‌లో పన్నులు పెంచాలని ప్రతిపాదించారు. దీంతో ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగి రైతులపై భారం పడనుంది.
- కాకినాడలో పెట్రో ఆధారిత పరిశ్రమల ఏర్పాటు, పిఠాపురం – కాకినాడ రైల్వే లైన్‌ను మెయిన్ లైన్‌తో అనుసంధానం చేసే ప్రాజెక్టుకు చోటు దక్కక పోవడం కాకినాడ జిల్లా వాసులను నిరాశపరిచింది.
- కోనసీమకు రైల్వే లైన్ ప్రాజెక్టుపై ఈ బడ్జెట్‌లో ఎటువంటి ప్రస్తావనా లేదు. గత ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో కేటాయించిన రూ.300 కోట్లకు అదనపు కేటాయింపులు ఉంటాయని ఈ ప్రాంత వాసులు ఎదురు చూసినా నిరాశే ఎదురైంది.

టీడీపీ విఫలం



సీఎం చంద్రబాబు రూ.లక్ష కోట్లు అడిగారు. అయితే బిహార్‌కు రూ.40 వేల కోట్ల వరకూ ప్రయోజనం కల్పించి, అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు మాత్రమే ప్రకటించారు. కూటమి ప్రభుత్వంలో టీడీపీ గట్టిగా అడగనందువల్లనే బడ్జెట్‌లో మనకు తక్కువ నిధులు కేటాయించారు. మెజార్టీ ఎంపీలు ఉండి ప్రశ్నించి నిధులు రాబట్టుకోలేకపోవడం అన్యాయం.

– **కర్నాకుల వీరాంజనేయులు, ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జగ్గంపేట**


రాష్ట్రానికి అన్యాయం



కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగినా సీఎం చంద్రబాబు మాట్లాడకపోవడం దురదృష్టకరం. బిహార్, జార్ఖండ్‌లకు కేటాయించిన నిధుల్లో సగం కూడా కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి కేటాయించలేదు. అరకొరగా నిధులు ఇచ్చినా రాష్ట్ర ఎంపీలు, సీఎం చంద్రబాబు మాట్లాడకపోవడం బాధాకరం.

– **కడితి సతీష్, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జగ్గంపేట**

కోనసీమ రైల్వేకు అ'ధనం' ఏదీ!



రైలు కూత వినాలని కోనసీమ వాసులు చిరకాలంగా ఎదురు చూస్తున్నారు. ఫిబ్రవరిలో ప్రకటించిన మధ్యంతర బడ్జెట్‌లో ఈ రైల్వే ప్రాజెక్టుకు కేటాయించిన రూ.300 కోట్లకు అదనంగా ఎంతో కొంత కేటాయిస్తారని ఎదురు చూశాం. కానీ, అలా లేకపోవడం నిరాశపరిచింది. **డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, కన్వీనర్, కోనసీమ రైల్వే సాధన సమితి, అమలాపురం**

మధుమేహపు కోత

క్లుప్తంగా

బైక్‌లో తాచుపాము కూన



తాచుపాము కూనను పట్టుకున్న గణేష్ వర్మ

అమలాపురం టౌన్: స్థానిక రాయల్ పెట్రోలు బంక్ వద్ద ఓ బైక్‌లో గోధుమ తాచు కూన చేరడంతో కొద్దిసేపు అక్కడికి వచ్చిన వాహన చోదకులు భయాందోళనలకు గురయ్యారు. మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటన జరుగగా పెట్రోలు బంక్ యాజమాన్య ప్రతినిధులు స్నేక్ క్యాచర్ గణేష్ వర్మకు ఫోన్ చేసి అక్కడికి రప్పించారు. స్నేక్ క్యాచర్ ఆ పాము పిల్లను బైక్ నుంచి బయటకు తీసి సీసాలో బంధించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వరదలు పెరుగుతున్న కారణంగా పాములు ఇలా బహిరంగ ప్రదేశాలకు చేరుకుని అవి కూడా తలదాచుకునే ప్రయత్నం చేస్తాయని గణేష్ వర్మ తెలిపారు.

52 ఏళ్ల మహిళపై అత్యాచార యత్నం

నిందితుడి అరెస్టు

మామిడికుదురు: ఇంట్లో వంట చేస్తున్న 52 ఏళ్ల మహిళపై అత్యాచార యత్నానికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా కోర్టు రిమాండ్ విధించిందని నగరం ఎస్సై పి.సురేష్ మంగళవారం తెలిపారు. పాశర్లపూడి కైకాటపేటకు చెందిన నిందితుడు గెద్దం సత్యనారాయణమూర్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా కోర్టు రిమాండ్ విధించిందన్నారు. వరుసకు మరిది అయిన నిందితుడు ఆమెపై కన్నేసి గత నెల 18వ తేదీ రాత్రి వంట చేస్తుండగా ఇంట్లో ప్రవేశించి ఆమెపై అత్యాచార యత్నానికి పాల్పడగా ఆమె ప్రతిఘటించి కేకలు వేసిందన్నారు. దీంతో నిందితుడు పరారయ్యాడని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చామన్నారు.

కనకదుర్గ గుడిలో చోరీ

పిఠాపురం: స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో ఉన్న కనకదుర్గాలయంలో సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. అమ్మవారి చెవి దిద్దులు, బొట్టు, రెండు జతల మంగళ సూత్రాలు, సుమారు 17 గ్రాములు విలువ కలిగిన బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు ఆలయ చైర్మన్ తుబక ఈశ్వరరావు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం పోలీసులు వచ్చి నిందితుడి వేలిముద్రలు సేకరించారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా దొంగను పట్టుకునేందుకు చర్యలు చేపడుతున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. నిందితుడు కోనసీమ జిల్లా మలికిపురానికి చెందిన వ్యక్తిగా పోలీసులు అనుమానిస్తున్నారు.

- సుగర్ ప్రభావంతో పెరుగుతున్న గాంగ్రిన్ కేసులు
- చేతి, కాళ్ల వేళ్లు తొలగించాల్సిన దయనీయ స్థితి
- నాలుగున్నరేళ్ల కాలంలో జీజీహెచ్‌లో 1,362 ఆంపిటేషన్లు
- మధుమేహంపై అవగాహన లేకే ఈ స్థితి అంటున్న వైద్యులు

కాకినాడ క్రైం: మధుమేహం చేసే హాని గుండె కోతకు కారణమవుతోంది. చంటిపిల్లల్లా చూసుకున్న శరీర భాగాలు కళ్ల ముందే దేహం నుంచి వేరుపడుతుంటే ప్రాణం పోయినంత పనవుతుంది. అప్పటివరకు దేహాన్ని ఇంధనంలా నడిపిన మన కాలో, చెయ్యో, ఇంకేదైనా శరీర భాగాలో ఆపరేషన్ థియేటర్ చెత్త బుట్టలో దర్శనమిస్తుంటే దిగమింగుకోలేని ఆవేదన కనుపాపల్ని తడిపేస్తుంది. అంతులేని వేదనై యావత్ జీవితాన్ని కుదిపేస్తుంది. మీకు సుగర్ వ్యాధి ఉందా... మందులు వాడటంలో నిర్లక్ష్యం వహిస్తున్నారా. ఫలితంగా రక్తనాళం మూసుకుపోయి రక్త ప్రవాహం ఆగిపోయిందా... అయితే తస్మాత్ జాగ్రత్త రక్తం ప్రవహించని దేహంలో ఏ భాగమైనా అర్ధంతరంగా తొలగించాల్సిన పరిస్థితి రావచ్చు. అలా తొలగించకపోతే కమ్ముకొచ్చే అపాయం యావత్ దేహాన్నే కబళించవచ్చు. మధుమేహాన్ని నిర్లక్ష్యం చేస్తున్న వేలాదిమంది ఆ ఫలితాన్ని అనుభవిస్తున్నారు.



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మధుమేహ బాధితులు

ఎందుకు ఈ స్థితి?

అన్ కంట్రోల్డ్ డయాబెటిస్, పెరిఫెరల్ వ్యాస్క్యులర్ డిసీజ్, డయాబెటిక్ న్యూరోపతి కండీషన్లలో శరీర భాగాన్ని తొలగించాల్సిన దుస్థితి ఎదురవుతుంది. ఈ స్థితిలో రక్తప్రసరణకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. రక్తనాళాలు మూసుకుపోవడం లేదా ప్రసరణకు పనికి రాకుండా పాడవడం వల్ల రక్త ప్రవాహం శరీర భాగాలకు జరగదు. ముఖ్యంగా రక్తం ఊర్ధ్వముఖంగా ప్రవహించే కాళ్లకు ఈ సమస్య ఎక్కువ. ఈ స్థితితో రక్త ప్రవాహం కోల్పోయిన దేహంలోని భాగం కుళ్లడం మొదలవుతుంది. ఇది ఇన్‌ఫెక్షన్‌కు గురై శరీరానికి వ్యాప్తి చెందుతుంది. ఆ వ్యాప్తిని నిలువరించడానికి ఆంపిటేషన్ (శరీర భాగాన్ని తొలగించేందుకు చేసే ప్రక్రియ) అనివార్యమవుతుంది.

సుగర్ కాకుండా...

మధుమేహం కాకుండా ధూమపానం, కుష్టువ్యాధి, వెన్నెముక గాయం, వెరికోజ్ వెయిన్స్, క్యాన్సర్ వల్ల ఏర్పడే పుండ్లు కారణంగా కూడా ఆంపిటేషన్ నిర్వహిస్తారు. ఎక్కువ సేపు నిలబడి పనిచేసే వారిలో కూడా ఈ సమస్య తలెత్తుతుంది. న్యూరోపతి స్థితిలో రక్త ప్రవాహం లేక స్పర్శ కోల్పోతారు. అటువంటి సమయంలో గాయాలు అయినా నొప్పి తెలియదు. దీంతో బాధితుడు గాయం కనిపించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తాడు. ఈ స్థితి ప్రమాదకరంగా పరిణమిస్తుంది.

పెరుగుతున్న ఆంపిటేషన్లు

మధుమేహ నిర్లక్ష్యం వల్ల శరీర భాగాలు దెబ్బతిని, వాటిని తొలగించాల్సిన స్థితి నానాటికీ అధికమవుతోంది. ఆంపిటేషన్‌గా పిలిచే ఈ ప్రక్రియను కాకినాడ జీజీహెచ్‌లో నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియల నిర్వహణలో గడచిన నాలుగున్నరేళ్ల కాలంలో స్పష్టమైన పెరుగుదల కనిపించింది.

సంవత్సరాల వారీగా..

2020లో	211
2021లో	93
2022లో	305
2023లో	472
2024 జూన్ వరకు	281

50 ఏళ్లు పైబడ్డ పేదలే అధికం..

గాంగ్రీన్‌కి గురవుతున్న వారిలో 50 ఏళ్లకు పైబడిన పేదలే అధికంగా ఉంటున్నారు. పేదరికంలో ఉన్న ఆ వయసు వ్యక్తుల జీవన శైలి ఆరోగ్య స్థితిగతులపై కుటుంబ సభ్యుల్లో పర్యవేక్షణ లోపిస్తుంది. రోజు వారీ కూలి పనులు, పొలం పనులు చేసుకుంటూ వ్యవసాయంలో తలమునకలయ్యే వారు తరచుగా గాయాలకు గురవుతుంటారు. తెలియని తనంతో తమ మధుమేహ స్థాయిని పరిశీలించుకోరు. సుగర్ వల్ల నీరసం వస్తున్నా శ్రమ వల్ల అనుకుంటారు. దీంతో వారిలో మధుమేహ స్థాయి అసాధారణంగా పెరుగుతుంది. కొనసాగింపుగా రోజువారి కార్యకలాపాలలో భాగంగా వారికి అయ్యే గాయాలు ప్రాణసంకటంగా మారుతుంటాయి.

అప్రమత్తంగా లేకపోతే అపాయమే



మధుమేహ బాధితులు గాంగ్రీన్ స్థితికి చేరడం అపాయకరం. ఎప్పటికప్పుడు వైద్యుడి సూచనల మేరకు సుగర్ నియంత్రణపై దృష్టి సారించాలి. సమతులాహారం, వ్యాయామం, నడక ద్వారా డయాబెటిస్‌ను నియంత్రించుకోవాలి. మందులు క్రమం తప్పకుండా వాడాలి. గాంగ్రీన్ తొలి దశలో కాళ్ల నొప్పి, వాపు నీటి బుడగలు ఏర్పడతాయి. అరికాళ్ల మంటలు వస్తాయి. జ్వరం వచ్చే అవకాశం ఉంటుంది. మానని గాయాన్ని నిర్లక్ష్యం చేయవద్దు. స్పర్శ తెలియని చోట గాయం అయితే అప్రమత్తం అవ్వాలి.

– డాక్టర్ వై.చిరంజీవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్ అనస్థీషియా, ఆర్ఎంసీ, కాకినాడ

మృత్యు కౌగిలికి మరొకరు...

- మూడుకు చేరిన మృతుల సంఖ్య
- కాకినాడ కారు ప్రమాద ఘటనలో చికిత్స పొందుతూ దుర్గాప్రసాద్ మృతి



జక్కల దుర్గాప్రసాద్ (ఫైల్)

కాకినాడ క్రైం: కాకినాడ కారు ప్రమాదం విషాద గీతికలను లిఖిస్తూనే ఉంది. శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే ఇద్దరు యువకులు చనిపోగా మరో యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం కాకినాడ జీజీహెచ్‌లో మృతి చెందాడు. దీంతో ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య మూడుకు చేరింది. నగరంలోని టూ టౌన్ పీఎస్ సమీపంలో ఉన్న ముమ్మిడివారి వీధికి చెందిన జక్కల దుర్గాప్రసాద్(32) ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. కారు ఢీకొన్న ధాటికి దుర్గాప్రసాద్ కుడి కాలు తెగిపడింది. ఈయన తండ్రి ప్రమాద స్థలిలో కుమారుడి కాలు వెతికి అంబులెన్స్ వెనక ఏడుస్తూ పరుగులు పెట్టిన తీరు కంట తడి పెట్టించింది. అయితే విధి కనికరించలేదు. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న దుర్గాప్రసాద్ ప్రమాదం వల్ల అధిక మొత్తంలో రక్తం కోల్పోయాడు. వైద్య బృందం నాలుగు రోజుల పాటు క్షతగాత్రుడిని కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. చివరికి మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో దుర్గాప్రసాద్ మరణించాడు. దుర్గాప్రసాద్‌కు ఎనిమిది నెలల క్రితమే వివాహం కాగా ఈయన భార్య సత్య ప్రస్తుతం ఐదవ నెల గర్భిణి. దుర్గాప్రసాద్ కన బోయే బిడ్డ కోసం ఎన్నో కలలుకన్నాడు. ఇదే విషయాన్ని కుటుంబసభ్యులు స్నేహితులు తలచుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. కుమారుడి మరణ వేదనను తాళలేక దుర్గాప్రసాద్ తండ్రి మార్చురీ వద్ద గుండెలవిసేలా రోదించిన తీరు చూపరులను కలచివేసింది. మూడేళ్ల క్రితమే దుర్గాప్రసాద్ సోదరుడు మరణించాడు. ఇప్పుడు దుర్గాప్రసాద్ మరణించడం ఆ కుటుంబాన్ని అంతులేని వేదనలోకి నెట్టేసింది. ప్రమాదానికి కారణమైన చల్లా రామ్మోహన్ కాకినాడ జీజీహెచ్‌లోని న్యూరోసర్జరీ వార్డులో చికిత్స పొందుతున్నాడు. ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడని వైద్యులు వెల్లడించారు.

విద్యుత్ ప్రమాదాలను నివారిద్దాం

ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ మూర్తి

రాజమహేంద్రవరం సిటీ: భారీ వర్షాలు, గాలులు ఉన్న సమయంలో విద్యుత్తు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలని వినియోగదారులకు ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ టీవీఎస్ఎన్ మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. వర్షాలు కురిసే సమయంలో ప్రజలు విద్యుత్తు ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తుపాను సమయంలో గృహోపకరణాల స్విచ్‌లను ఆఫ్ మోడ్‌లో ఉంచాలన్నారు. ఇంటి లోపల కరెంటు స్విచ్ బోర్డులో స్విచ్‌లను తడి చేతులతో ఆన్, ఆఫ్ చేయరాదన్నారు. చిన్న పిల్లలను కరెంటు వస్తువులను తాకనీయరాదని, ఇంటి సర్వీసు వైరు తెగినా, జాయింట్స్ కట్ అయినా వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ తాక కూడదన్నారు. వర్షం పడుతున్నపుడు విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లను ముట్టుకొనరాదని, ఇంటి పరిసరాలలో చెట్లు, కరెంటు పోల్స్ పడినా, వాలినా, కరెంటు వైర్లు తెగినా వెంటనే విద్యుత్ కార్యాలయం, కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఏ ప్రదేశంలోనైనా విద్యుత్ ప్రసారం జరిగే తీగలు (కండక్టర్) తెగి పడి వుంటే దానిని విద్యుత్ ప్రసారం ఉన్నదిగా పరిగణించి, సరియైన రక్షణ కల్పించే వరకు వాటిని నేరుగా తాకకుండా వెంటనే విద్యుత్ శాఖ సిబ్బంది టోల్ ఫ్రీ నంబర్ 1912కి తెలియజేయాలన్నారు. మోటార్ల స్టార్టర్లు, మోటార్లు వర్షం వల్ల నీటిలో మునగడం, పూర్తిగా తడవడం వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉంది కాబట్టి రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇళ్లు, భవన నిర్మాణాల సమయంలో నిర్మాణదారులు తగిన రక్షణ చర్యలు చేపట్టకుండా అజాగ్రత్తగా ఉండడం వలన ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నివారించేందుకు ముందు జాగ్రత్త చర్యలు పాటించాలన్నారు.

డీఎంహెచ్ఓ కార్యాలయ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

- ఫైలేరియా వైద్యాధికారి వేధింపులు తాళలేక అని పోలీసులకు ఫిర్యాదు



రాధాకృష్ణ (ఫైల్)

కాకినాడ క్రైం: స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయంలో కొనసాగుతున్న ఫైలేరియా రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ సెంటర్‌లో ఓ సీనియర్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కాకినాడ ఇంద్రపాలెంలో నివసిస్తున్న సీనియర్ అసిస్టెంట్ కాండ్రేగుల రాధాకృష్ణ (54) ఉన్నతాధికారుల వేధింపులు తాళలేక యానం వంతెనపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. దీనిపై ప్రత్యక్ష సాక్షులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు గౌతమీ గోదావరిని జల్లెడ పడుతున్నారు. మృదు స్వభావిగా పేరున్న రాధాకృష్ణపై ఓ మహిళా ఫైలేరియా వైద్యాధికారి గత నెల 28వ తేదీన డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. కార్యాలయంలో రాధాకృష్ణ జూన్ 24వ తేదీన తన చేయి పట్టుకున్నారన్నది ఆ ఫిర్యాదు సారాంశం. ఆయన్ని సరెండర్ చేస్తూ లేఖ ఇస్తున్నానని, దానిని ఉన్నతాధికారులకు పంపాలని కోరారు. అయితే కోటనందూరు పీహెచ్‌సీకి బదిలీ చేస్తానని డీఎంహెచ్ఓ చెప్పినా సరెండర్‌కే ఆమె పట్టుబట్టారు. దీంతో ఆయన ఆ లేఖను ఆర్‌డీకి సిఫారసు చేశారు. ఆర్‌డీ ఈ అంశంపై గత వారంలో విచారణకు ఆదేశాలిచ్చారు. సుమారు వారం రోజుల క్రితం డీఎంహెచ్‌వో, ఏడీఎంహెచ్‌వోలు కోర్టు కేసుల నిమిత్తం విజయవాడ వెళ్లారు. అదే రోజున పెద్దాపురం డివిజినల్ ఆఫీసర్ డీఎంహెచ్‌వో కార్యాలయంలో రాధాకృష్ణపై విచారణ జరిపారు. ఈ విచారణలో పదేళ్ల క్రితం రాధాకృష్ణ భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటనను ప్రస్తావిస్తూ మీ వేధింపులా? అదనపు కట్నం కోరడం ఆమె ఆత్మహత్యకు కారణమా అని అడిగారని, ఆమె ఆత్మహత్యకు వ్యక్తిగత అంశాలే తప్ప తాను కారణం కాదని, అదే విషయం కోర్టు విచారణలో రుజువైయిందని తాను నిర్దోషిని అని కోర్టు 2017లో తీర్పు ఇచ్చిందనీ చెబుతూ సదరు పత్రాలను విచారణ అధికారికి చూపించినట్టు వారికి చెప్పారు. ఆ విచారణ పూర్తయిన తర్వాతి రోజు నుంచి రాధాకృష్ణ ముభావంగా ఉండేవారు. ఫైలేరియా అధికారి, విచారణ అధికారి తనను కావాలనే మనోవేదనకు గురి చేస్తున్నారని సహోద్యోగులు, కుటుంబీకుల వద్ద వాపోయాడు.

ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున యానం వంతెన వద్దకు వెళ్లిన రాధాకృష్ణ తన సెల్ ఫోన్, పర్సు, ద్విచక్రవాహనం వంతెనపై ఉంచి గౌతమీ గోదావరి నదిలోకి దూకారు. తన తండ్రిని ఆత్మహత్యకు ప్రేరేపించారని ఆరోపిస్తూ పై విషయాలన్నీ పేర్కొంటూ సదరు ఫైలేరియా వైద్యాధికారిపై రాధాకృష్ణ కుమారుడు మంగళవారం రాత్రి ఇంద్రపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. మృతదేహం కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. రాధాకృష్ణ సుమారు రెండేళ్లుగా ఈ కార్యాలయంలో పనిచేస్తున్నారు. అంతకు ముందు ఈయన రామచంద్రాపురం పీపీ సెంటర్లో పనిచేశారు. ఈయనకు ఇద్దరు కుమారులు కాగా బంధువుల్లో పేదలైన ఇద్దరు పిల్లల బాధ్యత తీసుకొని తన పిల్లలతో పాటు పోషిస్తూ చదివిస్తున్నారు. ఆయనకు 80 ఏళ్ల తల్లి ఉంది. ఆయన మృతికి డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ సహా వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి.

రైసుమిల్లులో విద్యుత్ మోటార్ల చోరీ



విద్యుత్ మోటార్లతో పట్టుబడిన నిందితులు

కపిలేశ్వరపురం: మండలంలోని వెదురుమూడిలోని రైసుమిల్లులో సోమవారం రూ.80వేలు విలువగల 8, మండపేటలో 3 మొత్తం 11 విద్యుత్ మోటార్లను వివిధ గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు చోరీ చేశారు. రైసుమిల్లు నిర్వాహకులు పుట్టా కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు అదే రోజు కేసు నమోదు చేసినట్టు అంగర ఎస్సై అందె పరదేశీ మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం...రైసుమిల్లును పర్యవేక్షించేందుకు కృష్ణమూర్తి ఉదయం వెళ్లగా తాళాలు తెరచిఉన్నాయి. ఎనిమిది మోటార్లు చోరీకి గురవ్వడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా చోరీకి పాల్పడిన మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన బొచ్చా తరుణ్, కాలే సుబ్రహ్మణ్యం, గోకవరం మండలం రంప ఎర్రంపాలెం గ్రామానికి చెందిన అల్లగిరి సత్యసాయి చిట్టి గణేష్‌లను మంగళవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 11 విద్యుత్ మోటార్లు, పుల్లర్ బండి, మోటార్లను విప్పేందుకు వినియోగించే సామగ్రి స్వాధీనపర్చుకున్నారు. నిందితులను ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు ఎస్సై పరదేశి తెలిపారు.

పెరవలి కాలువలో మృతదేహం

పెరవలి: నరసాపురం కాలువలో పెరవలి వద్ద గుర్తు తెలియని మృతదేహం కొట్టుకు వెళుతుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ నెల 21వ తేదీ కొవ్వూరులో గోదావరి వద్ద కాళ్లు కడుగుకుంటూ ప్రమాదవశాత్తూ గోదావరిలో పడి కనిపించకుండా పోయిన నల్లజర్ల మండలం ఆవపాడు గ్రామానికి చెందిన పసుపులేటి వంశీకృష్ణ మృతదేహం అయి ఉంటుందని అనుకుంటున్నారు. మృతదేహం కనిపించిన వెంటనే ఎవరికి చెప్పాలో తెలియక కొంత సేపు, చెబితే ఏమి జరుగుతుందోనని మరికొంత సేపు స్థానికులు ఆలోచనలో పడటంతో మృతదేహం ముందుకు వెళ్లిపోయింది. పోలీసులు గాలిస్తున్నారు.

వీరేంద్రకుమార్‌ను స్వదేశానికి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్

అంబాజీపేట: ఏజెంట్‌ను నమ్మి వంట పని కోసం ఖతార్‌కు వెళ్లి మోసపోయిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ఇసుకపూడి వాసి సరెళ్ల వీరేంద్ర కుమార్‌ను సౌదీ అరేబియా నుంచి స్వదేశానికి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. ఈ విషయంపై హైదరాబాద్‌లోని ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి ద్వారా సౌదీ అరేబియాలోని ఇండియన్ ఎంబసీ అధికారులతో మంగళవారం సంప్రదింపులు జరిపారు. సౌదీ అరేబియా దామామ్‌లోని కింగ్ ఫహద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి వీరేంద్ర కుమార్‌ను తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. వీరేంద్ర కుమార్ బుధవారం మధ్యాహ్నానికి స్వదేశానికి రానున్నాడన్నారు. దీంతో వీరేంద్ర కుమార్ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పచ్చిమేతలో పోషక విలువలు

- ఎండు మేత పశువుల కడుపు నింపడానికే..
- పదో వంతు భూమిలో పచ్చగడ్డి గ్రాసాలు పెంచాలి

కొత్తపేట: పశువుల పోషణ రైతుకు పెనుభారమైన నేపథ్యంలో సమగ్ర పశుపోషణ పద్ధతులను రైతులు అలవర్చుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు. సమగ్ర పశుపోషణతోనే పశువులు ఆరోగ్యకరమైన జీవనం సాగించగలవని, ప్రధానంగా పచ్చిరొట్ట మేతల వల్ల పశువుల్లో పాల దిగుబడి పెరుగుతుందని చెబుతున్నారు. ప్రధానంగా వేసవి తరువాత వచ్చే వర్షా కాలం ప్రారంభంలో పశువుల మేతకు కొరత లేకుండా చూసుకోవాలి. పచ్చి మేతల వల్ల పశువుకు పోషక విలువలు అందుతాయి. కొన్నేళ్లుగా పశువులను మేపేందుకు కాపరులు ఆ పనికి రాక, వచ్చినా పెద్ద మొత్తంలో జీతాలు డిమాండ్ చేయడంతో పశు పోషణ రైతులకు భారమైపోయింది. దీంతో స్వయంగా పచ్చిమేత సాగుతో పాడి పశువులను పోషించవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

గడ్డిజాతుల్లో రకాలు

ధాన్యపు జాతి రకాలు

- హైబ్రీడ్ మొక్కజొన్న, మొక్కజొన్న ఉన్నాయి. హైబ్రీడ్ జొన్నలో పీసీ పూచాచారి 23, ఎంపీ చారి, ఎస్ఎస్‌జీ 53, ఎస్ఎస్‌జీ 59 అనే మూడు రకాలు ఎంపిక చేసుకోవాలి. మొదటి దశ కోత 60 రోజులకు వస్తుంది. ఎకరాకు 30 నుంచి 35 టన్నులు దిగుబడి వస్తుంది. ప్రతి 40 రోజులకు ఒక కోత చొప్పున 3 కోతలు వస్తుంది.



పాడి పశువుకు పచ్చిమేత

- మొక్కజొన్నలో ఆఫ్రికన్‌టాల్ లేదా గంగ, హైబ్రీడ్ ఎఫ్, విజయకిసాన్ రకాలు ఉన్నాయి. మొదటి కోత 60 నుంచి 70 రోజులకు వస్తుంది. 20 నుంచి 23 టన్నుల దిగుబడి వస్తుంది. 3 కోతల వరకూ వస్తుంది.

కాయజాతి పచ్చిమేతలు

- అలసందలో యూపీసీ 5236 రకం. ఈసీ 4216 రకం, ఐసీ 4216 రకం, రష్యన్ అలసంద రకాలు మంచివి. ఈ రకం 70 రోజులకు కోతకు వస్తుంది.
- పచ్చిమేత 8 నుంచి 10 టన్నుల దిగుబడి వస్తుంది. ఒక కోత మాత్రమే వస్తుంది.
- పిల్లిపెసర మొదటి కోత 50 రోజులకు వస్తుంది. 8 నుంచి 10 టన్నులు దిగుబడి వస్తుంది.
- జనుములో మొదటి కోత 50 రోజులకు వస్తుంది. 50 శాతం పూత దశలో కోయాలి. ఒకే కోత ఉంటుంది. 7 నుంచి 9 టన్నుల దిగుబడి లభిస్తుంది.

ఇలా వివిధ గడ్డి జాతులు అధిక పాల దిగుబడికి దోహదపడతాయని పశుసంవర్ధక శాఖ అధికారులు సూచించారు.

మేలుజాతి గడ్డి రకాలను పెంచాలి

రైతులు మేలుజాతి గడ్డి రకాలను పెంచుకోవాలి. తమకున్న పొలంలో పదో వంతు గర్భి సాగు వేయడం వల్ల పశుగ్రాసానికి కొరత ఉండదు. మేలుజాతి గడ్డి రకాలు తినడం వల్ల పశువులు అధిక పాలను ఇవ్వడం ద్వారా రైతులకు లాభాలు బాగుంటాయి.

– సీహెచ్ వెంకటనారాయణ,
ఏడీ, పశుసంవర్ధక శాఖ, కొత్తపేట

జిల్లాలో ఇదీ పరిస్థితి

పశువులు	సంఖ్య
పాడి గేదెలు	1,60,403
ఆవులు	75,839

పాడి-పంట

ప్రయోజనాలు ఇవీ..

ఎండు మేత పశువులకు కడుపు నింపడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. పచ్చిమేత కొరత రాకుండా చూసుకోవడానికి రైతు తన సేద్యభూమిలో పదో వంతు భూమిలో పచ్చగడ్డి గ్రాసాలు పెంచుకోవాలి. పచ్చిమేతలో అధిక పోషకాలు, విటమిన్లు ఎక్కువగా ఉండటం వలన ఎదకు త్వరగా రావడానికి, పాల ఉత్పత్తి పెరగడానికి ఉపయోగపడుతుంది. పచ్చి మేతల్లో కాయజాతి, కాయజాతి కానివి ఉంటాయి. కాయజాతిలో చిరుధాన్యాలు, గడ్డి రకాలు ఉంటాయి. కాయజాతి కాని రకాలు పశువులకు కావాల్సిన శక్తినివ్వడానికి, కాయజాతి రకాలు మాంసకృత్తుల వృద్ధికి దోహదపడతాయి. మేలు జాతి గడ్డి రకాలను రైతులు పెంచుకోవాలి. పచ్చగడ్డిలో 70 శాతం పోషకాలు ఉండగా ఎండుగడ్డిలో 30 శాతం మాత్రమే ఉంటాయి.